విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 11, సెప్టెంబర్ 2023

మచ్చలేని చంద్రుడిపై కక్ష సాధింపు సరికాదు

- ప్రతిపక్షాలను అణగదొక్కాలని చూస్తున్న జగన్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు..
- సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి
- సంఘీభావం తెలిపిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

విశాలాంధ్ర బ్యూరో అనంతపురం : మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి శ్రేణులు అనంతలో సామూహిక దీక్షలు చేపట్టారు. ఈమేరకు సిపిఐ నాయకులు సైతం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ

రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడు చంద్రబాబు నాయుడు అని కేవలం కక్ష సాధింపు ధోరణితోనే ఆయనను అరెస్టు చేశారని సీఎం జగన్‌పై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అన్ని వ్యవస్థలను నిర్వీర్యంచేసి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాడని, సంక్షేమం పేరుతో సంక్షోభం సృష్టిస్తూ ప్రతిపక్ష పార్టీల ఉనికి లేకుండా చేసెందుకు కుట్ర రాజకీయాలు చేస్తున్నాడని దుయ్యబట్టారు.ప్రజా సమస్యలపై తెలుగుదేశం పార్టీ ధర్నాలు,నిరసనలు చేపట్టకుండా గొంతు నొక్కడం, ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజ్యాంగేతర శక్తిగా హిట్లర్, ముస్సోలిని తలపించేలా ఎపి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని మండి పడ్డారు.జగన్ కక్ష సాధింపు ధోరణికి పరాకాష్టగా చంద్రబాబు నాయుడు అరెస్టు ఉందని ఏకరువు పెట్టారు. 2021లో స్కిల్ డెవలప్మెంట్ కేసు ఎఫ్ఐఆర్ దాఖలు అయితే నాలుగు సంవత్సరాల తర్వాత ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తిని ఈ విధంగా ఇబ్బందులకు గురి చేయడం అప్రజాస్వామికమని ఘాటుగా వ్యాఖ్యానించారు.చంద్రబాబుకు ఎపి ప్రజలు బ్రహ్మరథం పడుతున్న నేపథ్యంలో సీఎం జగన్ ఓర్వలేకనే ఇలాంటి వికృత చర్యలకు పాల్పడుతున్నాడని అసహనం వ్యక్తం చేశారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా సిఐడి కేసు ఉందని సీఎం జగన్ పైశాచిక ఆనందానికి ఇది నిదర్శనమన్నారు.

చంద్రబాబు అరెస్టును వ్యతిరేకించిన జగదీష్..

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ హాజరై మాజీ సీఎం చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ తన సంఘీభావాన్ని తెలిపారు. అనంతరం జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాలను అనచడమే లక్ష్యంగా జగన్ పాలన సాగిస్తున్నాడన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కుంభకోణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాత్ర ఉందని, గుజరాత్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగించిన స్కిల్ డెవలప్మెంట్ అక్కడ లేని అవినీతి కేవలం రాష్ట్రంలోనే ఎలా వచ్చిందని వైసీపీ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కేవలం కక్ష సాధింపు ధోరణితోనే మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడిపై అనవసరమైన కేసులు బనాయించి ఇబ్బం దులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప మేయర్ సాకే గంపన్న, టిడిపి నాయకులు దేవళ్ల మురళి, మారుతి కుమార్ గౌడ్, అజీజ్, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, బంగినాగ, రాజారావు,ముక్తి ఆర్, సుధాకర్ యాదవ్, బొమ్మినేని శివ, నారాయణస్వామి యాదవ్, సిమెంటు పోలన్న, పోతుల లక్ష్మీనరసింహులు, కుంచెపు వెంకటేష్, గోపాల్ గౌడ్, చేపల హరి, మార్కెట్ మహేష్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, వెంకటేష్, వన్నూర్,తెలుగుమహిళలు స్వప్న, విజయ్ శ్రీ రెడ్డి, బుల్లే శివ బాల,సంఘ తేజస్విని, సరళ, జానకి, దలవాయి రమాదేవి, కృష్ణవేణి, వసుంధర, హసీనా, వరలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు జగన్ ప్రతీకారానికి నిదర్శనం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్..



విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం : రాష్ట్రంలో ప్రతిపక్షాలపై ప్రతికారమే లక్ష్యంగా జగన్ పరిపాలన కొనసాగుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు.ఎపి సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టునుతీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు అర్ధరాత్రి హడావిడి చేయడం,నంద్యాలలో చంద్రబాబు బస్సు వద్ద గందరగోళం సృష్టించడం చివరకు అరెస్టు చేయడం రాజకీయ కక్ష సాధింపేనన్నారు. జగన్ సర్కార్ ప్రతిపక్షాలను వేధింపులకు గురి చేస్తోందని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన ఎఫ్ఐఆర్ కాపీలో 2021లో ఆయన పేరు లేకపోయినా అదే ఎఫ్ఐఆర్ కాపీలో చంద్ర బాబు నాయుడు పేరు ఇప్పుడు ఎలా వచ్చిందని సీఎంను సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబుపై ఆరోపణలు ఉన్నప్పుడు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టి ఉండాల్సిందని అయితే అర్ధరాత్రి డ్రామాలు ఏమిటని ప్రశ్నించారు. జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర అభివృద్ధి పక్కనపెట్టి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు తనయుడు లోకేష్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి నేతలను ఎక్కడికక్కడ పోలీసులు నిర్బంధించడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ బస్సులను సాక్షాత్తు పోలీసులే నిలిపివేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు.పారిశ్రామిక వేత్తలకు వైసీపీ నేతల నుంచి బెదిరింపులు ఎక్కువయ్యాయని మండపడ్డారు. నిత్యం ప్రతిపక్షాలపై వేధింపులు నిర్బంధాలు దాడులు అక్రమ అరెస్టులు పెరిగిపోతున్నాయని ఏపీలో ప్రజాస్వామిక పాలన అట్టకెక్కిపోయి పోలీసుల రాజ్యం నడుస్తోందని తూర్పారబట్టారు.జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తన పార్టీ కార్యాలయానికి రోడ్డు మార్గనే వెళ్తాను ఉన్నా పోలీసులు వెళ్ళనీయకుండా అర్థరాత్రి సమయంలో ఆయనను అడ్డుకోవడాన్ని తప్పుబట్టారు. జగన్ ప్రభుత్వం నిరంకుశ విధానాలు అవలంభిస్తోందని ప్రజాతంత్ర వాదులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

తాడిపత్రిలో ఆదివారం నిర్వహించిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వైసీపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సంపూర్ణ మెజార్టీతో జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు అధికారమిస్తే కక్షపూరిత రాజకీయాలకు వాడుకోవడం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు.

చట్టం ఎవరి చుట్టం కాదు : ఎమ్మెల్యే జొన్నలగడ్డ

విశాలాంధ్ర -శింగనమల: రాష్ట్రంలో 14ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసి కోట్ల రూపాయల స్కాం చేసి రెండు ఎకరాల స్థాయి నుంచి వేల కోట్ల రూపాయలను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపాదించారని, చట్టం ఎవరి చుట్టం కాదని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు అరెస్టుపై ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ పేరుతో రూ.371 కోట్లు అడ్డంగా దోచుకొని పూర్తి ఆధారాలతో దొరికి పోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని సద్వినియోగపరిచే విధంగా ఉండాలి కానీ చంద్రబాబు నాయుడులా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకూడదని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఎన్ని విధాలుగా డబ్బు కూడ పెట్టాలో ఆలోచించారని పేర్కొన్నారు. 2018 లో పూణేలో కొన్ని కంపెనీల అక్రమ ఇన్ వాయిస్ లతో ఈ స్కాం బయటపడిందని, బిల్లులపై స్టేట్ ఏసీబీకి లేఖ రాయడం జరిగిందని , అప్పట్లో చంద్రబాబు ఎందుకు విచారణ వాయిదా వేసుకున్నారని ప్రశ్నించారు. ఆయన చేసిన అక్రమ లావాదేవీలు బయటకు వస్తాయనే భయంతోనే వాయిదా వేయడం జరిగిందన్నారు. తప్పు చేయలేదని ధైర్యం ఆయనకు ఉండి ఉంటే ఆ రోజే విచారణకు ఒప్పుకునేవారని చెప్పారు. 2021 లో ఏపీ.యస్. యస్.డి,సి చైర్మన్ గా అజయ్ రెడ్డి స్కిల్ డెవలప్మెంట్ లో అక్రమాలు జరిగాయని కంప్లైంట్ ఇవ్వడంతో వాటి ఆధారంగా ఎఫ్ఐఆర్ ఫైల్ చేయటం జరిగిందన్నారు. రెండేళ్లుగా సిఐడి లోతుగా దర్యాప్తు చేసిందని, చంద్రబాబు పాత్రపై స్పష్టమైన ఆధారాలు లభ్యమైనందునే అరెస్ట్ చేసినట్లు వివరించారు. స్కిల్స్ స్కామ్ లో రూ.371 కోట్లు వివిధ షెల్ కంపెనీలకు వెళ్లి తిరిగి చంద్రబాబు ఖాతాకు చేరినట్లు సిఐడీ గుర్తించిందని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఉన్నది లేనట్లు ప్రజలకు భ్రమలుకల్పిస్తున్నారని, ఆయన 40 ఏళ్ల అనుభవం, నాలెడ్జ్ ఉందని చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో వేల అక్రమ సంపాదన పోగు చేసుకున్నారన్నారు.

ఆత్మహత్య.. మహాపాపం

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అనంతపురం బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినం కార్యక్రమం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆచార్య కేఎల్ సుబ్రహ్మణ్యం, ఆచార్య వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేవుడిచ్చిన గొప్ప బహుమానం మానవ జీవితమని, అలాంటి అత్యుత్తమమైన జీవితాన్ని అర్ధాంతరంగా ఆత్మహత్యతో ముగించుకోవడం పాపమని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

విశాలాంధ్ర–బ్రహ్మసముద్రం: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవన్ ముందు చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కార్యకర్తలతో కలిసి సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. జగన్ పాలనను రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని, సైకో ప్రభుత్వాన్ని ఎప్పుడు సాగనంపదామా అని ప్రతిపక్ష నాయకులే కాకుండా తెదేపా కార్యకర్తలే కాకుండా సొంత పార్టీ నాయకులు కోరుకుంటున్నారని అన్నారు.

రిమాండ్‌కు తరలిస్తే మంత్రి ఇంటిని ముట్టడిస్తాం

విశాలాంధ్ర–బ్రహ్మసముద్రం: సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మచ్చలేని నాయకుడు చంద్రబాబుని రిమాండ్‌కు తరలిస్తే మంత్రి ఇంటిని ముట్టడిస్తామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంత రావు చౌదరి పేర్కొన్నారు. ఆదివారం ఉన్నం కార్యాలయంలో సామూహిక నిరాహార దీక్ష చేపట్టి మాట్లాడుతూ ఎఫ్ఐఆర్‌లో లేని పేరు మార్చారని, 2021లో జరిగిన ఘటనను నేడు ఉద్దేశపూర్వకంగా లండన్‌లో ఉండి చంద్రబాబును ముద్దాయిగా చేర్చడం హాస్యాస్పదం అన్నారు. పోలీసుల సహకారంతో శునకానందం పొందాలంటే చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు.

పాముకాటుతో మహిళ మృతి

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం: కుటుంబ పోషణ కోసం పొలం పనుల కూలీ పనికి వెళ్లిన గంగమ్మ(32) పాము కాటుతో మృతి చెందింది. కుందుర్పి మండలం రుద్రంపల్లిలో ఆదివారం విషాదాన్ని నింపింది. భర్త ఈశ్వరయ్యతో కలిసి పొలం పనులకు వెళ్లిన గంగమ్మ టమాట కాయలు పీకుతుండగా పాము కాటేసింది. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే గంగమ్మ చనిపోయింది. మృతురాలికి రాజు, అరుణ్ ఇద్దరు పిల్లలు ఉన్నారు.

12 స్కూల్ గేమ్స్ ప్రారంభం

విశాలాంధ్ర–శెట్టూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 12న మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ ఎర్రిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 బాల బాలికలు విభాగంలో కోకో, కబడ్డీ, వాలీబాల్ టెన్నికాయిన్స్, షట్టిల్, త్రోబాల్, పోటీలు నిర్వహిస్తామని, మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులు నియోజకవర్గం స్థాయిలో జరిగే పోటీలకు అర్హత పొందుతారని తెలిపారు. క్రీడాకారులు క్రీడా సామగ్రిని వెంటతెచ్చు కోవాలన్నారు. వివరాలకు 9492600901ను సంప్రదించాలని తెలియజేశారు.

ఏఐఎస్ఎఫ్ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర–గుంతకల్లు: నెల్లూరు జిల్లాలో సెప్టెంబర్ 15, 16 తేదీలలో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం సీపీఐ కార్యలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.కుళాయిస్వామి మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపైన పోరాటాల కోసం ఈ మహాసభలలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ తీసుకుంటారని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేణు, వెంకట్ నాయక్, నాయకులు శ్యామ్, సతీష్ నాయక్, అశోక్, రవితేజ, నరసింహ, మధు, ఫర్హాన్ , గురు, సతీష్, నసిర్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్ దారుణం..

విశాలాంధ్ర–రాప్తాడు: మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు దారుణమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. రాప్తాడు టీడీపీ కార్యాలయంలో ఆదివారం సామూహిక నిరాహార దీక్ష చేశారు. సైకో సీఎం డౌన్, డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాప్తాడు మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శ్రీనివాసులు, ఎంపీటీసీ జాఫర్, అనంతపురం రూరల్ మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ ఎంపీపీ మాధవి, ఆత్మకూరు కన్వీనర్ ముట్టాల శ్రీనివాసులు, అనంతపురం రూరల్ కన్వీనర్ సూర్యనారాయణ, మారినేని సూర్యనారాయణ, సర్పంచులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా దీక్ష

విశాలాంధ్ర–శింగనమల: మండల కేంద్రంలో ఆత్మ రామాలయం దగ్గర శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, టిడిపి మాజీ మండల కన్వీనర్ చితంబరి దొర మాట్లాడుతూ ముఖ్యమంత్రి లండన్‌లో ఎఫ్ఐఆర్లో లేని చంద్రబాబు నాయుడిని ముద్దాయిగా చేర్చడం హాస్యాస్పదం అన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి ఘన స్వాగతం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి స్వాగతం పలుకుతున్న నాయకులు

అనంతపురం జిల్లా, విశాలాంధ్ర, యాడికి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 21 వ జిల్లా మహా సభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా తాడిపత్రిలో జరిగుచున్న జిల్లా మహా సభలకు హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ను సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో సిపిఐ నాయ కులతో కలిసి పూలమాలలు శాలు వాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రైల్వే స్టేషన్ నుండి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీగా తరలి వెళ్లారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి వడ్డే రాముడు, బండారు రాఘవ, ఓబిరెడ్డి, బాలన్న,వీరితో పాటు యాడికి మండలం నుండి 60 మంది సిపిఐ కార్యకర్తలు తరలి వెళ్లారు.

వీరవనిత కామ్రేడ్ చాకలి ఐలమ్మ

విశాలాంధ్ర బ్యూరో అనంతపురం : జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఆపార్టీ శ్రేణులు తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వక అధ్యక్షుడు లింగమయ్య నేతృత్వంలో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ ఐలమ్మ భూమికోసం, భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వీరవనిత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు మేకల పెంపక దార్ల సంఘం రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నాగప్ప, ప్రజా నాట్యమండలి నాయకుడు అక్కులప్ప, నగర అధ్యక్షుడు అయ్యప్ప, నగర కార్యదర్శి నాగరాజు, నాయకులు సంజీవులు, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రిలే దీక్షలు

విశాలాంధ్ర–ఉరవకొండ: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఆదివారం ఉరవకొండ పట్టణంలో టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ రిలే నిరాహారదీక్షల కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు.

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆవిర్భావం సాధించిన విజయం

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 1943 సంవత్సరంలో నెల్లూరు జిల్లాలోని అలగాని పాడు గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు జరిగింది. గతంలో అనంత పురం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ కూలీలు రైతులు భూస్వాముల పొలాల్లో కాయకష్టం చేస్తే రోజు వారీ అర్థ సేరు కూలి ఇచ్చేవారు. ఈ విషయంపై నెల్లూరు జిల్లా అలాగాని పాడులో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అనంతపురం జిల్లా పర్యటన వచ్చిన సందర్భంలో తాడిపత్రి ప్రాంతంలోని పెద్దపప్పూరు మండలం చీమల వాగు పల్లి లో గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఒక వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు అప్పట్లో కామ్రేడ్ వీకే ఆదినారాయణ రెడ్డి, కామ్రేడ్ పి వెంగమనాయుడు గారు బాధ్యత తీసుకొని ఈ మహాసభలను జయప్రదం చేశారు. ఈ మహాసభ తీర్మానం మేరకే వ్యవసాయ కూలీలకు ఇస్తున్న రోజు కూలి అర్థ షేరు నుండి పెం చాలని డిమాండ్ చేస్తూ చీమల వాగుపల్లి తోపాటు సింగనమల మండలం తరిమెల గ్రామంలో మొట్టమొదటిసారిగా కూలీ సమ్మె ప్రారంభమైంది. ఈ సమ్మెకు భూస్వాములు దిగివచ్చి అర్థసేరుకూలి ని పెంచడం జరిగింది.ఈ నేపధ్యంలో ఆయా గ్రామాల్లో సైతం అర్థ సేరు కూలి ని పెంచడంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వ్యవసాయ కూలీల పక్షాన విజయ బావుటా ఎగురవేసినట్టైంది.అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల చేతుల్లో ఉన్న భూములను దున్నేవానికి దక్కాలని నినాదంతో ప్రారంభమైన భూ పోరాటం మొట్టమొదటిసారిగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రామగిరి మండలం గాదికుంటలో ప్రారంభమైంది. ఈ భూ పోరాట ప్రారంభానికి నాయకత్వం వహిం చిన కామ్రేడ్ ఐదు కళ్ళు సదాశివన్ కామ్రేడ్ నీలం రాజశేఖర్రెడ్డి, కామ్రేడ్ వికే ఆదినారాయణ రెడ్డి ,గాదిగ కుంట ముత్యాలమ్మతో పాటు పలువురు కమ్యూనిస్టు శ్రేణులు నాయకత్వం వహించి భూములను నిరుపేదలకు పంపిణీ చేయడం జరిగింది. ఆసమయంలో ప్రారంభమైన భూపోరాట కళ్యాణదుర్గం ప్రాంతంలోని కుందుర్పి, సెట్టూరు, కంబదూరు, బ్రహ్మసముద్రం తదితర మండలాల్లో ప్రభుత్వ బంజర భూములను భూమి లేని నిరుపేదలకు దాదాపు 40 వేల ఎకరాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ భూ పోరాటానికి కామ్రేడ్ బంగి ఎర్రిస్వామి, కామ్రేడ్ పి ఎస్ శర్మ, కామ్రేడ్ హరి హరప్ప , కామ్రేడ్ తిమ్మప్ప, కామ్రేడ్ నర్సింహులు, సెట్టూరు మండలంలో కామ్రేడ్ కనుకూరు హను మంతప్ప, కామ్రేడ్ సెట్లు రుద్రప్ప, కామ్రేడ్ చనగకాయ లింగప్ప, కామ్రేడ్ తిప్పారెడ్డి , కామ్రేడ్ కాసిం సాబ్, కంబదూరు మండలంలో కామ్రేడ్ ఎగువపల్లి తిమ్మప్ప, కామ్రేడ్ అందేపల్లి నారాయణరెడ్డి, కళ్యాణ్ దుర్గం మండలంలో కామ్రేడ్ సిబాయ్ తిమ్మప్ప, కామ్రేడ్ పాల్వాయి సిద్ధప్ప కామ్రేడ్ తిమ్మ సముద్రం మలరాయుడు, నాయకులు నాయకత్వం వహించి పేదలకు భూ పంపిణీ చేశారు. ఉరవకొండ ప్రాంతంలో కమ్యూనిస్టు నాయకులు వసికేరప్ప, కోటిరెడ్డి, వై.నారాయణరెడ్డి, మహిపతి, ఓబులయ్య, హను మంతప్ప, చాయాపురం రంగన్న, పెనకల పాటి తిప్పారెడ్డి, కూడేరు మండలంలో వెంకటపతి, వెంకట నాయుడు, జయమ్మ భూ పోరాట ఉద్యమానికి కృషి చేశారు.ఇంకా అనేక ప్రాం తాల్లో భూ పోరాటం నిర్వహించి వ్యవసాయ కార్మిక సంఘం చరిత్ర కెక్కింది.2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని 600 జిల్లాల నుండి 200 జిల్లాలకు పరిమితం చేయా లని తలపెట్టిన సందర్భంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా 2006లో నార్పల మండలం బండ్లపల్లిలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించిన ప్రాంతం నుండి అనంతపురం వరకు పాదయాత్ర నిర్వహించి రెండవ రోజు వేయి మందితో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ పాదయాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ , మాజీ ఎమ్మెల్సీ ఆంధ్రప్రదేశ్ యువసేన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, అప్పటి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు జాఫర్ గారు, నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగయ్య, కేశవరెడ్డి, డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల దీక్షకు సిపిఐ సంఘీభావం

విశాలాంధ్ర–గుంతకల్లు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆదివారం గుంతకల్లు పొట్టి శ్రీరాములు కూడలి వద్ద టిడిపి మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చేపట్టిన సామూహిక నిరాహార దీక్ష లకు సిపిఐ నియోజవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ నియోజవర్గం సహాయ కార్యదర్శి బి.మహేష్ ,సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్ర స్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన అరాచక పాలనగా మారిందన్నారు.మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని అక్రమ అరెస్టు చేయడం పై జగన్మోహన్ రెడ్డి అధికార బలంతో సైకోగా మారదున్నారు. రాష్ట్రంలో నియంత్రణ పాలన జరుగుతుందని మండిపడ్డారు.వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు,ఏఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి సురేష్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి పి సి కులాయప్ప ,సిపిఐ నాయకులు మక్బుల్ భాష,పుల్లయ్య,ఏఐఎస్ ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడిని విడుదల చేయకపోతే

పెద్ద ఎత్తున ఆందోళనలు

- టిడిపి మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్ర గౌడ్

విశాలాంధ్ర–గుంతకల్లు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సంఘీభావం తెలుపుతూ ఆదివారం టిడిపి మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. గుంతకల్లు మాజీ జితేంద్ర గౌడ్, గుంతకల్లు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనాథ్ గౌడ్,రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడ్,టీడీపీ నాయకులు కె.సీ హరి,యువ నాయకులు అనిల్ గౌడ్ సంఘీభావాం తెలిపారు.పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నేతలు తరలివచ్చారు. జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ... ప్రపంచ ఖ్యాతి గాంచిన టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడిని జగన్ అరెస్టు చేయించి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌కు కళంకం తెచ్చారన్నారు. చంద్రబాబు నాయుడుని వెంటనే విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చంద్రబాబుపై నమోదు చేసిన ఆక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి, బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇంత నికృష్టమైన పరిపాలన ఉందంటే ఒక్క జగన్మోహన్ రెడ్డి పాలనే ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. దీక్షలో తలారి మస్తానప్ప, హనుమంతు,మాజి మార్కట్ యార్డ్ చేర్మంన్ జి.వెంకటేష్,లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి, వాల్మికి సాదికార సమితి జిల్లా అధ్యక్షులు ప్రతాప్ నాయుడు, కేశప్ప,వాల్మీకి రాము,నందిశ్వర్,సురేంద్ర, రమేష్,బొజ్జే నాయక్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 11, సెప్టెంబర్ 2023

ఉపాధ్యాయుల జీతాల మాటేమిటి?

- ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి ప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-ఎంపీకుంట: క్యాడర్ స్ట్రెంత్ అప్డేట్ సమస్య పరిష్కారం కాకపోవడంతో 10వతేదీ వచ్చినా జిల్లా వ్యాప్తంగా 70 శాతం మంది ఉపాధ్యా యులకు జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆదివారం ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి ప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్‌లో బదిలీలు, పదోన్నతులు, సర్దుబాటు కింద పాఠశాలలు మారిన 30 వేల మందికి 3 నెలలుగా జీతం అందక అష్ట కష్టాలు పడుతు న్నారని, తాజాగా సాంకేతిక సమస్యల సాకుతో సగం మంది ఉపాధ్యాయులకు పదో తారీఖు వచ్చినా జీతాలు అందక పోవడం ఏమిటని ప్రశ్నించారు. నంబులపూలుకుంట మండలంలోని ధనియాని చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలనందు ప్రధానోపాధ్యా యుని పోస్ట్ రద్దు కావడంతో ఆ పాఠ శాల ఉపాధ్యాయులను డిడిఓగా ఎంఈఓ పరిధిలోకి సిఎఫ్ఎంఎస్ వారు మ్యాప్ చేయాలి. అలా చేయని కారణం గా పాఠశాల మొత్తం ఉపాధ్యాయులకు జీతాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. తమ పిల్లల్ని చేర్పించిన విద్యా సంస్థలు ఫీజులు అడుగుతుంటే సమాధానం చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. కిరాణా షాపు, పాలు, పేపర్, కరెంటు తదితర బిల్లుల్ని సకాలంలో చెల్లించలేక అవహేళనకు గురవుతున్నామని ఉపాధ్యాయులు మనోవేదన చెందుతున్నాను. బ్యాంకుల్లో గృహ, వ్యక్తిగత రుణాలు తీసు కున్న వారు మూడు నెలలగా కంతులు చెల్లించే పరిస్థితి లేదన్నారు.

చంద్రబాబు నాయుడి అరెస్టు జగన్ ప్రతీకారమే..

- సిపిఐ సత్య సాయి జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-ధర్మవరం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు జగన్ ప్రతీకారమేనని సిపిఐ శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తో పాటు అనంతపురం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మల్లికార్జున , ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప లు పట్టణంలో మాజీ మంత్రి పరిటాల సునీత పరిటాల శ్రీరామ్ నూతన గృహ ప్రవేశం, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ ఆహ్వానం మేరకు ధర్మవరం స్థానిక సిపిఐ నాయకులుతో పరిటాల శ్రీరామ్ ను కలవడం జరిగింది. అనంతరం పరిటాల శ్రీరామ్కు శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం జిల్లా కార్యదర్శి వేమయ్య పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు చేయడం ప్రజాస్వామ్యమని, చాలా తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలపై ప్రతికారమే లక్ష్యంగా జగన్ పరిపాలన కొనసాగిస్తుందని తెలిపారు. పోలీసులు అర్ధరాత్రి హడావిడి చేయడం,నంద్యాలలో చంద్రబాబు బస్సు వద్ద గందరగోళం సృష్టించడం, చివరకు అరెస్టు చేయడం దారుణమన్నారు. జగన్ సర్కార్ ప్రతిపక్షాలను వేధింపులు గురి చేస్తుందని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అరెస్టు చేసిన ఎఫ్ఐఆర్ కాపీలో 2021లో చంద్రబాబునాయుడు పేరు లేదు కానీ, ఈరోజు అదే ఎఫ్ ఐ ఆర్ కాపీలో చంద్రబాబు నాయుడు పేరు ఎలా వచ్చిందని వారు ప్రశ్నించారు?చంద్రబాబుపై ఆరోపణలు ఉంటే పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి, విచారణ చేపట్టవచ్చని కానీ ఆ అర్ధరాత్రి డ్రామాలు ఏమిటని ప్రశ్నించారు?. జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర అభివృద్ధి పక్కనపెట్టి, కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు తనయుడు లోకేష్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా టిడిపి నేతలను ఎక్కడెక్కడ పోలీసులు నిర్బంధించడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ బస్సులను సాక్షాత్తు పోలీసులే నిలిపివేయడం, ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం అన్నారు. పారిశ్రామిక వేతలకు వైసీపీ నేతలు నుంచి బెదిరింపులు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. నిత్యం ప్రతిపక్షాలపై వేధింపులు, నిర్బంధాలు, దాడులు, అక్రమ అరెస్టులు పెరిగిపోతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్లో ప్రజాస్వామిక పాలన అట్టకెక్కి, పోలీసుల రాజ్యం నడుస్తుందని తెలిపారు.జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తన పార్టీ కార్యాలయానికి రోడ్డు మార్గనే వెళ్తాను అన్నా... కూడా పోలీసులు వెళ్ళనీయకుండా అర్ధరాత్రి సమయంలో పవన్ కళ్యాణ్ ను అడ్డుకోవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.జగన్ ప్రభుత్వం నిరంకుశ విధానాలు అవలంబిస్తున్నారని, ప్రజాతంత్ర వాదులంతా ఇలాంటి చర్యను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రవికుమార్ చేనేత కార్మిక సంఘం అధ్యక్ష,కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు విజయభాస్కర్, శ్రీధర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

చట్ట పరిధిలో చంద్రబాబు నాయుడికి శిక్ష తప్పదు

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: చట్ట పరిధిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శిక్ష తప్పదని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలకు పాతరేసి సెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు నాయుడుకు ముడుపులు ముట్టజెప్పడం జరిగిందని ఆ కుంభకోణంలో చంద్రబాబు నాయుడు మొదటి ముద్దాయి అని తెలిపారు. వారి కను సన్న లోనే రూ.371.25 కోట్ల ప్రజాధనం సెల్ కంపెనీ ద్వారా స్వాహా అయిందని వారు తెలిపారు. చంద్రబాబు నాయుడు అవినీతిని గతంలో అసెంబ్లీలో వేదికగా తాను ఆధారాలతో సహా నిరూపించడం జరిగిందని వారు తెలిపారు. 2014 ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు సన్నిహితుడు ఇల్లందు రమేష్ జర్మనీ కంపెనీ అయిన సిమెంట్స్ కంపెనీలో భారత్ విభాగంలో పనిచేస్తున్న సుమన్ బోస్ డిజైన్ టెక్ ఎండి వికాస్ కాన్వలకు పరిచయం చేసి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు సిల్క్ డెవలప్మెంట్ ప్రాజెక్టుకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టు అంచనా వ్యయం మొత్తం రూ.3,356 కోట్లు అవుతుందని ఇందులో ఏపీ ప్రభుత్వం వాటాగా 10 శాతము సిమెంట్స్ కంపెనీ నుంచి 90 శాతం నిధులు ఖర్చు పెట్టేలా చర్చించుకోవడం కూడా జరిగిందని తెలిపారు. ఈ చర్చ జరిగిన కొద్ది రోజులకే స్కిల్ డెవలప్మెంట్ ఎండిగా చంద్రబాబు సన్నిహితుడు గంటా సుబ్బారావును నియమించి, 2015 జూన్ 30న ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ నాలుగు విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఐదు దశలో నిధులు విడుదల చేసిన సదరు సిమెంట్ డిజైన్ టెక్ కంపెనీ చెల్లించాల్సిన 90 శాతం వాటా నిధులలో పైసా కూడా విడుదల చేయలేదని తెలిపారు. ప్రభుత్వ నిధులను సెల్ కంపెనీల ద్వారా అక్రమంగా నిధులు మళ్లించి మళ్లీ చంద్రబాబుకు చేరడం జరిగిందన్నారు. నిధులు విడుదలై నెలలు గడుస్తున్న నిరుద్యోగ యువతకు సంబంధించి ఉపాధి కల్పనకు ఒక అడుగు కూడా ముందుకు వేయలేకపోవడం దారుణమని తెలిపారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసి అనేక కుంభకోణాలలో చంద్రబాబు నాయుడు ప్రధాన సూత్రధారి అని ఆయనకు ప్రజాక్షేత్రంలో చట్టపరిధిలో కఠిన శిక్ష తప్పదని తెలిపారు.

ఘనంగా కూచిపూడి కళాక్షేత్రం వార్షికోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సాంస్కృతిక మండలిలో ఆదివారం సాయంత్రం కూచిపూడి కళా కేంద్రం గురువు నటరాజ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అయిదవ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్నకుమార్, చోలిగాల వెంకటేశులు, యోగ గొర్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 16 మంది చిన్నారులచే కూచిపూడి, భరతనాట్యం, జానపద గీతాలు, చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అదేవిధంగా హెచ్.పీ గ్యాస్ గోవింద చౌదరి మనవరాలు లక్ష్మీ చౌదరి చే కర్ణాటక సంగీతం కీర్తనలు ఆలపించిన వైనం అందరినీ ముగ్ధుల్ని చేసింది. ముఖ్య అతిథులు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే భారతీయ సంస్కృతి కళలను నేర్చుకోవడం నిజంగా సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు చదువుతోపాటు ఇటువంటి పురాతన కళలను కూడా తమ బిడ్డలకు నేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రసాద్‌తో పాటు, కళాకారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి : ఏఐటియుసి

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని చౌలూరు పీహెచ్‌సీ ఆశా వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆదివారం జయమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.నాగవేణి, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీసవేతనం 26,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని, ఆశా వర్కర్ల పట్ల పై అధికారుల వేధింపులు ఆపాలని, పెండింగ్లో ఉన్న లెప్రసీ, టీబీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భూమిక, యస్.పద్మావతి, శారద, అలివేలమ్మ, రాధ, లింగమ్మ, పద్మావతమ్మ, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పిచ్చి.. పరాకాష్టకు చేరింది

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండలో సామూహిక నిరసన దీక్ష వద్ద తెలుగు దేశం పార్టీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ మాట్లాడుతూ తెలుగుఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన చంద్రబాబు దేశంలో ఏ ఒక్కరినీ అడిగినా చంద్రబాబు దార్శనికత గురించి చెబుతారు. జగన్ 16 నెలలు జైల్లో ఉన్నాడు. చంద్రబాబుని 16 నిమిషాలైనా జైల్లో పెట్టాలన్నది జగన్ ఆశ, చంద్రబాబు స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో ఇరికించి అక్రమంగా అరెస్టు చేశారు. రాజకీయ కక్షతోనే ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడమే జగన్ ప్రతీకార వాంఛ ముఖ్యం కాబట్టి ప్రతీకారం తీర్చుకోవడం ఆయన పిచ్చి పరాకాష్టకు చేరడం చూస్తున్నామని, ఐదేళ్ల స్కిల్ డెవలప్?మెంట్ ప్రాజెక్టుతో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారు.వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపే రోజుల దగ్గరలో ఉన్నాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు సంఘీభావం తెలియచేసారు.

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహం ఊరేగింపు..

విశాలాంధ్ర-కొత్తచెరువు: హిందూ జ్ఞాన వేదిక ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తచెరువులోనే వివేకానంద విద్యానికేతన్ ఆవరణములో శ్రీకృష్ణ అష్టమి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. గత ఐదు రోజులుగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఊరేగింపు సందర్భంగా విగ్రహాన్ని పల్లకిలో ఏర్పాటుచేసి గ్రామంలో వందలాది మందితో పురవీధుల గుండా నిర్వహించారు. పాఠశాల నుండి ప్రారంభమై తమ పాలెం బీసీ కాలనీ వడ్డెర కాలనీ గాంధీనగర్, నెహ్రూనగర్ గుండా ఊరేగింపు సాగింది. భక్తుల వేషధారణ ఆకట్టుకుంది.

అనారోగ్యం పాలైన తోటి ఉద్యోగికి చేయూత

విశాలాంధ్ర-బత్తలపల్లి: బత్తలపల్లి పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న హెచ్సి : 2031 ఓబులేష్ అనారోగ్య కారణంగా కొన్ని రోజుల నుండి సెలవులో ఉన్నారు. అతని మెరుగైన వైద్యం కొరకు బత్తలపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆరోహణరావు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, మిత్రులు ఆదివారం రూ.77,100 ఆర్థిక సహాయాన్ని ఓబులేష్ కొడుకుకి ఏఎస్ఐ సోమశేఖర్ మూర్తి, నాగరాజు, నారాయణస్వామి, జనార్ధన్, బాలకృష్ణ, అంజనేయులు కలసి అందించి మానవత్వం చాటుకున్నారు.

చంద్రబాబు నాయుడి అరెస్టుపై వెల్లువెత్తిన నిరసనలు

- రిలే దీక్షలు చేపట్టిన తెలుగు తమ్ముళ్లు
- నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

విశాలాంధ్ర-ఎన్ పీ కుంట : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆదివారం తెలుగుతమ్ముళ్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న మండల టీడీపీ నాయకులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. తెలుగు తమ్ముళ్లు స్టేషన్ రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా మండల యువ నాయకుడు దండే గంగశేఖర్ మాట్లాడుతూ అక్రమ అరెస్టు చేసిన మా నాయకుడు చంద్రబాబు నాయుడు ఎటువంటి తప్పు చేయలేదని కడిగిన ముత్యంలా బయ టకు వస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దండే గంగశేఖర్, హనుమంతు రెడ్డి, అజ్మతుల్లా, గంగిరెడ్డి, సూర్యశేఖర్ నాయుడు, మధుసూదన్ రెడ్డి, క్రిష్ణమాచారి, బీసీ సెల్ రవి,ఫయాజ్,గంగాధర నాయుడు, చలపతి నాయుడు, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టు తగదు..

విశాలాంధ్ర-పుట్టపర్తి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసన తెలుపుతూ టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఆదివారం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట టిడిపి నేత చంద్రబాబు నాయుడు అరెస్టు నిరసనగా టిడిపి శ్రేణులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. శాంతి దొంగ చేస్తున్న టిడిపి నాయకులను పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులను అరెస్టు చేసి స్టేషన్ కు తరలించే ప్రయత్నం చేశారు. దీంతో మహిళలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో శాంతి యుతంగా నిరసన తెలియజేస్తుంటే అరెస్ట్ ఎందుకు చేస్తారు అంటూ మహిళలు పోలీసులను నిలదీశారు.చివరకు చేసేదిలేక పోలీసులు నిరసనకారు లను వదిలిపెట్టారు. దీంతో యధావిధిగా ఆర్డీవో కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన కొనసాగించారు. అనంతరం పోలీసులు టిడిపి నాయకులను అరెస్టు చేసి స్టేషనుకు తరలించారు. కార్యక్రమంలో రూరల్ కన్వీనర్ విజయ్ కుమార్, నాయ కులు సాలక్క గారి శ్రీనివాసులు, అంబులెన్స్ రమేష్, జయ ప్రకాష్, గూడూరు ఓబులేసు, వెంకటరాముడు, చంద్రశేఖర్, గ్యాస్ బాబు, ఉమాపతి, బుక్కపట్నం మాజీ సర్పంచ్ యశోదమ్మ, మాజీ కౌన్సిలర్ చిన్న కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్‌లో చంద్రబాబు పేరులేకున్నా అరెస్టులా..?

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆదివారం సామూహిక నిరాహార దీక్ష మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసి దీక్షలు కొనసాగించారు. ఆయన ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుపై మండిపడ్డారు. ఎఫ్ఐఆర్‌లో చంద్రబాబు పేరేలేదు అలాంటిది ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారనీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చంద్రబాబును అరెస్టు చేయించి శు నకానందం పొందుతున్నా రని, చంద్రబాబు మీద మచ్చ వేయడం ఎవరి తరం కాదని వైసిపి పార్టీకి రోజుల దగ్గర పడ్డాయని అందువల్లనే వికృత చేష్టలు చేస్తున్నాడని ప్రజలందరికీ నిజా నిజాలు తెలిసి పార్టీని బొంద పెట్టే రోజుల దగ్గర్లో ఉన్నాయని అనే హెచ్చరించారు.

12న భగవద్గీత సాధన శిబిరం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్లో గల సాంస్కృతిక మండలిలో ఈ నెల 12వ తేదీ మంగళవారం సాయంత్రం 6:00 నుండి రాత్రి 8 గంటల వరకు మాతాజీ స్వామి చంద్రానంద భగవద్గీత సాధన శిబిరం నిర్వహిస్తున్నట్లు గాజుల సోమేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ భగవద్గీత సాధన శిబిరంలో నిత్యజీవితంలో ఎదుర్కొనే సవాళ్లు వాటి సంఘటనలు అన్ని తెలుసుకునే అవకాశం ఉందని తెలిపారు. అలాగే అన్ని సంఘటనలు వ్యక్తులతో అన్ని పరిస్థితులలో దేనిమీద వ్యామోహరహిత స్థితిలో అంతర్గత శాంతి ఆనందాన్ని ఎలా పొందాలి? కర్మ, భక్తి, జ్ఞానయోగములు ఎలా సాధన చేయాలి? అన్న విషయములను భగవద్గీతలోని ఎంపిక చేసిన శ్లోకముల ద్వారా తెలియజేయడమే ఈ గీత సాధన శిబిరం ముఖ్య లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ కొరకు ఎవరైనా విరాళాలు ఇవ్వదలచినచో 80జి కింద ఇన్కమ్ టాక్స్ రిబేటు కలదని తెలిపారు. వివరాలకు, 8074145733, 9396570362ను సంప్రదించొచ్చు.

సుదర్శన క్రియ నేర్చుకోవడానికి అద్భుతమైన అవకాశం

సీనియర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ అనూప్

విశాలాంధ్ర-ధర్మవరం: సుదర్శన క్రియ నేర్చుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశం హ్యాపీ నెస్ ప్రోగ్రాంలో కలదని సీనియర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్. జి.ఆర్. అనుప్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఓ ప్రకటనలో మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో ఎన్జీవో హెూం నందు సెప్టెంబర్ 26వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు మహిళలకు పురుషులకు వేరువేరుగా ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పురుషులకు ఉదయం 5:30 నుండి 8:30 వరకు, మహిళలకు సాయంత్రం నాలుగు నుండి ఏడు వరకు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9642254375 కు సంప్రదించాలని తెలిపారు.

ఆర్మీ కృషి అనన్యసీయం : ఎమ్మెల్యే కేతిరెడ్డి

- ఆర్మీవారికి ఎల్లవేళలా అండగా ఉంటా..
- కమ్యూనిటీ హాల్‌కు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ

విశాలాంధ్ర-ధర్మవరం: దేశానికి విశేష సేవలు అందిస్తున్న ఆర్మీ కృషి అనన్యసీయమని, రుణం తీర్చుకోలేని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఎల్పీకే పురంలో గల ఎక్స్ ఆర్మీ సర్వీస్ మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణా నికి భూమి పూజ చేశారు. తదుపరి ఆర్మీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసి ఆర్మీ వారు రక్షిస్తున్నారని, అటువంటి ఆర్మీల సమస్యలు పరిష్కరించుటలో నా వంతుగా సహకరిస్తానని తెలిపారు. ఎవరికైనా సొంత ఇల్లు లేకుంటే అతి త్వరలోనే ఇంటి పట్టాలు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు కూడా తాను తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఆర్మీ ఉద్యోగస్తులకు ప్రతి ఒక్కరూ గౌరవ, మర్యాదలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మేడాపురం వెంకటేశులు, ఇన్చార్జులు చాంద్ భాషా, బాలిరెడ్డి, ధర్మవరం ఎక్స్ ఆర్మీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు రామిరెడ్డి, ఆర్గనైజర్ మహేష్, కార్యదర్శి శివశంకర్, కోశాధికారి నాగభూషణం, వైస్ ఉపాధ్యక్షులు పవన్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షులు పెద్దిరెడ్డి, హిందూపురం, మడకశిర, కదిరి ప్రాంతాల నుండి ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షులు కూడా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

సబ్సిడీపై గొర్రెలను అందజేస్తాం..

- జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్న కురుబ సామా జిక వర్గానికి చెందిన కురుబ కులస్తులందరి వినతి మేరకు గొర్రెలకు సబ్సిడీపై పంపిణీ చేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆదివారం వారి స్వగృహంలో కురుబ కులస్తులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కురుబ కులస్తులు మాట్లాడుతూ తెలంగాణలో గొర్రెలకు సబ్సిడీ కింద ప్రభుత్వంతోందని, ఆంధ్రప్రదేశ్లో కూడా సబ్సిడీ కింద ప్రభుత్వం గొర్రెలు ఇచ్చే విధంగా న్యాయం చేయాలన్నారు. చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తప్ప కుండా జనసేన పార్టీ అధికారంలోకి వచ్చాక పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లి మీకు న్యాయం జరిగే విధంగా తాను కృషి చేస్తానని వారు హామీ ఇచ్చారు.

పేదలకు సేవ చేయడమే రోటరీ క్లబ్ లక్ష్యం

క్లబ్ కార్యదర్శి నాగభూషణ,కోశాధికారి సుదర్శన్ గుప్తా

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు సేవ చేయడమే రోటరీ క్లబ్ ముఖ్య లక్షణం అని క్లబ్ కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్ గుప్తా, క్యాంపు చైర్మన్లు నరేందర్ రెడ్డి, రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి-బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ-అనంతపురం వారి సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ కంటి వైద్యాధికారి, రెడ్ క్రాస్ సొసైటీ పట్టణ చైర్మన్ డాక్టర్ నరసింహులు పాల్గొన్నారు. డాక్టర్ నరసింహులు, నాగభూషణం, నరేందర్ రెడ్డి, శివయ్యలు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా ఇప్పటికే 32,000 మందికి కంటి ఆపరేషన్లను ఉచితంగా చేయించడంతోపాటు ఉచితంగా కంటి అద్దాలు కూడా పంపిణీ చేయడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి శిబిరాలు దాతలు సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు కొత్తపల్లి ఉలిక్కి రెడ్డి జ్ఞాపకార్థం భార్య సరస్వతమ్మ-ధర్మవరం, పి. ఆర్. ధృవకుమార్ తండ్రి పిఆర్. రవికుమార్-అనంతపురం వారు వ్యవహరించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. నేత్రదానం చేసి, రెండు జీవితాలలో వెలుగు నింపాలని తెలిపారు. అనంతరం దాత సరస్వతమ్మ ను, బెంగళూరు కంటి డాక్టర్. మెహ్రూన్, రోటరీ క్లబ్ కమిటీ ఘనంగా సత్కరించారు. శిబిరంలో 103 మంది రోగులు పాల్గొనగా 75 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్ల తెలిపారు. కార్యక్రమంలో సత్రశాల ప్రసన్న కుమార్, రమేష్ బాబు, శివయ్య, సోలిగాళ్ళ వెంకటేష్, నాగరాజు, పెరుమాళ్ళ దాసు, జయచంద్ర, శంకర కంటి ఆసుపత్రి కోఆర్డినేటర్ శివ ప్రకాష్ పాల్గొన్నారు.